శృంగార వీధి

# సీతాకళ్యాణం

.. ప్రసాద్ ..

"ఏయ్ వేణూ, ఏవిటీ నీ సంగతి? నన్ను పెళ్లి చేసుకోనన్నావుట?"

"ఎవరు చెప్పారు?"

"ఎవరు చెప్తేనేంలే, నిజమా, కాదా?"

"నిజమేననుకో..."

"ఏం నన్ను పెళ్లాడడానికేం మాయరోగం? చదువు లేదా, అందం లేదా?"

"ఛ,ఛ, అలా ఎవరన్నారు?"

"మరింకేం? ఫామిలీ ఫ్రెండ్స్‌మి. చిన్నప్పట్నుంచి కలిసిమెలిసి ఆడాం, పెరిగాం. ఒకర్నొకరు అర్థం చేసుకున్నవాళ్లం. మా అమ్మా, నాన్నా వచ్చి అడిగితే మీవాళ్లు నీఇష్టం అన్నారట. నువ్వేమో ఇలా..."

"ప్లీజ్, నువ్వు మరోలా అనుకోకు. ఓ చిన్న అభ్యంతరంవల్లనే కుదరదన్నాను."

"ఏమిటి? నీకంటే ఓరోజుపెద్దదాన్ననేగా?"

"మరింకేం? అన్నీ తెలిసి నువ్వలా డైరెక్టుగా అడిగితే ఏం చెప్పాలి?"

"పెద్దదాన్నయితే సంసారానికి పనికిరానా?"

"ఇంత సీరియస్ విషయంలోకూడా నీకు చిలిపితనం పోదుకదా! మనం మాట్లాడేది సంసారం గురించి కాదు, పెళ్లిగురించి."

"పెళ్లిగురించేనయ్యా అడుగుతున్నాను. ఎక్కడో ఢిల్లీలో కదా నీఉద్యోగం. పెళ్లయ్యాక ఝామ్మని అక్కడికి వెళ్లిపోతాం. అక్కడందరికీ నువ్వే పెద్దవాడవని చెప్పుకో. ఇక్కడ మనవాళ్లు నాలుగు రోజులు కనుబొమలెగరేస్తారు. ఆ తర్వాత కళ్లు నొప్పిపుట్టి వాళ్లే మానుకుంటారు."

"ఇప్పుడు సరే. కొన్నేళ్లు పోయాక, అంటే మిడిల్ ఏజ్ వచ్చాక మనమధ్యతేడా కొట్టవచ్చినట్టు కనబడదూ? పురుళ్లవల్ల ఆడవాళ్లు లావెక్కి, పెద్దవాళ్లలా కనబడతారంటారుగా! నువ్వసలే పెద్దదానివి..."

"తగ్గవోయ్, అదంతా పాతకాలంమాట. ఈ కాలంలో మగాళ్లని చూడు. బానబొజ్జలు, బట్టతలలు పెరిగిపోయి ముందే ముసలాళ్లయి పోతున్నారు. ఆడాళ్లు బ్యూటీ క్లినిక్లకెళ్లి ట్రిమ్‌గా, యూత్‌ఫుల్‌గా ఉంటున్నారు. అలా చూస్తే నాకంటే కనీసం ఐదేళ్లు చిన్నవాణ్ని చేసుకోవాలి. పోనీకదాని..."

"అదిగో చూశావా, నువ్వు నన్ను బాసింగ్ చేస్తున్నావు. నాకంటే పెద్దదానివనేగా. చిన్నప్పట్నుంచీ ఇంతే. లెక్కలు నేర్పేటప్పుడు నేను తప్పు చేస్తే స్కేలు పెట్టికొట్టేసేదానివి. నాకిష్టమైన రంగు బట్టలు వేసుకుంటానంటే, నీకు నప్పదు అని డబాయించేసేదానివి. నాకు ఫుట్ బాల్ ఇష్టమంటే, 'కాదు, క్రికెట్ టీమ్‌లో చేరు' అని బలవంతంగా చేర్పించేవు. పెద్దదానివి కదాని నువ్వు చెప్పినమాటల్లా వినేసేవాణ్ని. రేపు భార్యవయితే ఇక చెప్పనే అక్కర్లేదు. 'కుర్రసన్నాసివి, నీకేమీ తెలీదు, ఊరుకో' అనేసి డామినేట్ చేసేస్తావు."

"ఇదిగో బుచ్చబ్బాయీ! ఓటి తెలుసుకో. నువ్వు నామాట విన్నది, నామీద అభిమానంతో, ప్రేమతో. మీ అమ్మగారు నాకంటే పెద్దవారు. ఆవిడ మాటవిన్నావా? ఇక నిన్ను డామినేట్ చేయడమంటావా, నన్ను కాక మరెవర్ని కట్టుకున్నా కూడా నిన్ను నీ పెళ్లాం డామినేట్ చేయడం ఖాయం. నువ్వలాటి బుద్ధావతారానివి."

"అలాగేం, పోన్లే. నేను బుద్ధావతారానన్నని ఆఅమ్మాయికి తెలియడానికి కొంత టైము-ఏడాదో, రెండేళ్లో పడుతుందికదా. అప్పటిదాకానైనా నేను డామినేట్ చేస్తాను."

"నువ్వలా ఉడుక్కున్నావంటే, పెళ్లినాడే నీసంగతంతా చెప్పేస్తా. ...పోన్లే, ఇదంతా ఎందుకుగానీ, నిజంగా చెప్పు, నేను నీకువద్దా? నన్ను పెళ్లి చేసుకోవా?"

"..నువ్వు సీరియస్‌గా అడుగుతున్నావు కాబట్టి చెబుతున్నాను. నువ్వు నాకంటే వయస్సులో పెద్ద అనే విషయం నాకు మనసులో మెదలుతూనే ఉంటుంది. ఐ కాంట్ హెల్ప్ ఇట్. అందుకే మనం ఫ్రెండ్స్‌గా మిగులుదాం. నీమనసు నొప్పిస్తున్నందుకు సారీ."

"ఇదే నీఅంతిమనిర్ణయమయితే అలాగే కానీ. కానీ ఓ చిన్నరిక్వెస్టు. మళ్లీ ఎప్పుడు కలుస్తామో తెలీదు. అందుకని ఓ చిన్న 'గుడ్ బై కిస్'. ఖంగారు పడకు. నిన్ను పెట్టమనములే. నువ్వు జంకుతావని తెలుసు. నేనేపెడతాను. కాస్సేపు భరించు."


ఆమె అతని భుజంమీద చేతులేసి దగ్గరకు లాక్కుంది. చేతులు జార్చి, వీపు చుట్టేసింది. ఒక చేయి తల వెనక్కు పోనిచ్చి తలను వంచింది. అతని పెదాలు తన పెదాలపై ఆనేటట్లు. అతని చేతులు అప్రయత్నంగానే ఆమె నడుమును చుట్టేశాయి. ఆమె పెదాల బిగింపు ఉధృతమైనకొద్దీ ఆ చేతులు కిందకు జారి ఆమెను తనలో కలుపుకున్నాయి.

ఆమె కళ్లు తెరిచింది. కౌగిలి సడలించింది. ఒక్కడుగు వెనక్కి వేసింది.



"గుడ్ బై వేణూ! ఇంటికెళతాను. ఇవాళ రాత్రేగా నీ ప్రయాణం. ఈజన్మకిది చాలు. కొద్దిరోజుల్లో నువ్వు పరాయిసొత్తువయిపోతావుగా!'

వేణు మత్తులోంచి బయటపడటానికి ప్రయత్నిస్తున్నట్లు తల విదిల్చాడు. నోరు పెగల్చుకు



న్నాడు. "ఆగాగు. ఒక్క విషయం చెప్పు. ఇంతకింత యితే, అంతకెంత?" అన్నాడు కళ్లు పెద్దవిచేసి.

ఆమె చిరునవ్వు నవ్వింది. అంతలోనేపెదాలు బిగించి, మూతి తిప్పింది. "ఎంతయితే నీకెందుకు లే! ఎలాగూదక్కనప్పుడు.." అనేసి విసవిసా వెళ్లిపోయింది.

* * *

"అదేమిటి వేణూ, పొద్దున్నే మాఇంటికొచ్చావు! నిన్న రాత్రి ప్రయాణం..."

"..టికెట్ కాన్సిల్ చేసుకున్నాను. పెళ్లివిషయం ఫైనలైజ్ చేసుకొని వెళదామని ఆగేను."

"కంగ్రాట్స్! ఎవరా పెళ్లికూతురు?"

"నువ్వే! ఒక్కరోజులో నిర్ణయం ఎలా మారిందని క్లాసు తీసుకోకు."

"తీసుకోనులే. అయినా అంత సడన్‌గా..."

"దేన్నైనా కోల్పోయేదాకా దాని రుచి తెలియదు. 'డయాబిటిస్ వచ్చింది. పంచదార వేసుకోవద్దని డాక్టరంటే చాలు, పంచదారమీద వ్యామోహం పెరిగిపోతుంది. అసలు పంచదార రుచే తెలీదనుకో, మనం ఏం 'మిస్' అవుతున్నామో తెలియదు. అప్పుడు బాధేఉండదు. తెలిస్తేనేబాధ. అనుకోకుండా నువ్వు నీతో శృంగారం ఎలా వుంటుందో కాస్త రుచి చూపించేవు. దాన్ని తలచుకున్నప్పుడల్లా 'అమ్మో, ఇది జీవితాంతం పోగొట్టుకోవడమా?' అని అనిపించి మనసు వెంపర్లాడింది. అన్ని అభ్యంతరాలనూ పక్కకు నెట్టేసింది. ఇంట్లో చెప్పేశాను, ఇవాళ రాత్రి ట్రైనెక్కి వెళ్లాలి. మళ్లీ పెళ్లికే రావడం."

"పోన్లే, తెలివైన పని చేశావు."

"మెచ్చుకున్నావు కాబట్టి, ఇప్పుడు గుడ్ బై కిస్ పెట్టనివ్వాలి."

"పెట్టనిస్తాగానీ ఓ షరతు. నువ్వు రాత్రి కదా రైలెక్కడం? మధ్యాహ్నం ఒకసారి, సాయంత్రం ఇంకోసారి వచ్చి గుడ్ బై చెప్పాలి. సరేనా?" Ⓟ